నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 28 జనవరి 2025 | ADILABAD NIRMAL

● రైతన్నా మేమున్నాం

# అధ్యయన కమిటీ ఆత్మస్థైర్యం నింపింది

## ఆదిలాబాద్ జిల్లా పర్యటనపై రైతుల అభిప్రాయం

● కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే నట్టేట ముంచిందని ఆవేదన ● రుణమాఫీ కాక.. సకాలంలో రైతు భరోసా రాక అరిగోస పడుతున్నామని మండిపాటు

● బీఆర్ఎస్‌తోనే రైతుకు మేలని స్పష్టం

### బీఆర్ఎస్ అధ్యయన కమిటీతో ధైర్యం..

భీంపూర్, జనవరి 27 : జైనథ్ మండలం గిమ్మ నుంచి మేము చాలా మంది రైతులం యాపల్‌గూడకు వచ్చి బీఆర్ఎస్ అధ్యయన కమిటీ నాయకులతో మా ఇబ్బందులు చెప్పుకున్నాము. మా గ్రామంల 1422 మంది రైతులు పంటరుణాలు తీసుకున్నరు. మొత్తంగా 392 మందికే రుణమాఫీ చేశారు. మిగతా రైతులంతా పరేషాన్ అవుతున్నరు. ఇక మా గ్రామంలా భూమి లేని నిరుపేదలకు ఒక్కరికీ ఆత్మీయ భరోసా జాబితాలో పేరు రాలేదు. వారు ప్రభుత్వం సూచించిన 2023లో 20 రోజుల ఉపాధి పనులకు వెళ్లలేదని ఇలా చేశారు. భూమి లేని నిరుపేదలు అనారోగ్యంతో ఉన్నా.. ఇంకా ఏవైనా పనులున్నా ఉపాధి పనులకు వెళ్లడం కష్టమైతది. ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీ పథకానికి లింకు ఏమిటో అర్థం కావడం లేదు. ఈ రకంగా కాంగ్రెస్ సర్కారుతోని రైతులు, కూలీలకు ఎదురవుతున్న కష్టాలను మేము అధ్యయన కమిటీ వారికి చెప్పినం. యాపల్‌గూడ, రామాయి గ్రామాల్లో పంట చేలకు వెళ్లి ఓపికగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతులకు అండగా ఉంటామని మాజీ మంత్రి జోగురామన్న, నాయకులు చెప్పిన మాటలు మాకు ధైర్యాన్ని ఇచ్చాయి. ఎట్లాగూ వచ్చేది బీఆర్ఎస్ సర్కారేనని నమ్మకం కలిగింది. **- కోల భోజన్న , గిమ్మ, జైనథ్ మండలం**

### బీఆర్ఎస్ లీడర్లు మా బాధలు తెలుసుకున్నరు..



భీంపూర్, జనవరి 27 : కాంగ్రెస్ సర్కారు వచ్చినంక మా కుటుంబానికి ఏ పథకం రాలే. నేను చిన్న రైతును. 3 ఎకరాల్లో సాగు చేసుకుంటూ బతుకుతున్న. ఆదిలాబాద్ మహారాష్ట్ర బ్యాంకులో రూ. 2.40 లక్షల పంట రుణం ఉన్నది. రెన్యువల్ చేసినం. ఇగ రూ.2 లక్షల లోపల ఉన్న మస్తు మంది రైతులకు మాఫీ కాలేదు. మాకు అయితదనే నమ్మకం లేదు. రైతుభరోసా వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబితే తెల్లారే దాకా చూసిన రాలేదు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు రైతు బంధు సాయాన్ని పంటలు సాగు చేసే టైంకి జమ చేసిండు. రైతుబంధు వస్తదనే నమ్మకంతోటి ఉళ్లళ్ల అప్పులు పుట్టేవి. ఇప్పుడు పెట్టుబడికి ఇబ్బందిగా మారింది. మొన్న యాపల్‌గూడకు బీఆర్ఎస్ లీడర్లు వచ్చిండ్రు. మా బాధలు తెలుసుకున్నరు. రైతులందరికీ మేమున్నామని ధైర్యం ఇచ్చిండ్రు.
**- భగవాండ్లు, యాపల్‌గూడ, ఆదిలాబాద్ మండలం**

### రైతుభరోసా రాలే

భీంపూర్, జనవరి 27 : కాంగ్రెస్ సర్కారు ఇగ ఎట్లయినా 26 జనవరి అర్ధరాత్రి నుంచి రైతుభరోసా పైసలు వస్తయి. ఫోన్లు టింగు టింగు మంటయి అని సీఎం సారు టీవీల చెబితే నమ్మినం. నాతో పాటు మా గ్రామంల రైతులంతా రాత్రి బారాబజే నుంచి ఫోన్ల డబ్బులు జమైనట్లు మెస్సేజ్‌ల కోసం ఎదురు చూసినం. తెల్లారే దాకా చూసినా మెస్సేజ్‌లు రాలే. ఇట్లా ఊకూకె మాట మార్చేటి సర్కారు మీద మేమంతా నారాజ్‌గానే ఉన్నము. రైతు, కూలీ ఇతరులందరికీ ఈ సర్కారు పద్ధతి నచ్చడం లేదు. మొన్న బీఆర్ఎస్ నాయకులు వచ్చి మేమున్నము అని ధైర్యం ఇచ్చిండ్రు.
**- గెడాం లక్ష్మణ్, అంతర్గాం, భీంపూర్ మండలం**

### ఎవరికీ రాలే..

భీంపూర్, జవనవరి 27 : అసలు మాకు కాంగ్రెస్ సర్కారు పథకాలే అర్థం కావడం లేదు, ఆత్మీయ భరోసా అనేది భూమి లేని పేదలకు. న్యాయంగా నైతే అర్హులందరికీ ఇవ్వాలి. అందరికీ ఇయ్యలేక ఈ పథకానికి ఉపాధి పనులకు 2023ల 20 రోజులైనా వెళ్లాలని నిబంధన పెట్టారు. దీంతో మా గ్రామంల ఎందరో మంది పేదలకు ఈ పథకం అందే అవకాశం లేదు . ఈ పథకం చిన్న సన్నకారు రైతులకు ఇస్తే మేలు జరిగేది. ఇగ రైతుభరోసా 26 జనవరి అర్ధరాత్రి నుంచి ఇస్తమన్నారు. ఎవరికీ రాలేదు. అది ఇస్తారన్న నమ్మకం లేదు. గ్రామంలా ఇందిరమ్మ ఇండ్లకు ఎందరు దరఖాస్తు పెడితే అందరి పేర్లు లిస్టుల ఉన్నయి. ఆఖరికి ఇచ్చేదెందరికో.? ఇపుడు మండలానికి ఒక్క గ్రామంలనే ఐదు, పది మాత్రమే రేషన్ కార్డులిచ్చిండ్రు. వీటిపై ఇప్పుడే బియ్యం ఇస్తరన్న నమ్మకం లేదు. ఇగ మొన్న బీఆర్ఎస్ అధ్యయన కమిటీ అచ్చినంక మాకే గాదు గ్రామంలా అందరికీ కొంత ధైర్యం అచ్చింది. మళ్లా బీఆర్ఎస్ సర్కారే వచ్చేలా ఉన్నది.
**- విఠల్, రైతు, యాపల్‌గూడ, ఆదిలాబాద్ రూరల్ మండలం**

"కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే నట్టేట ముంచింది. రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తమన్నది.. రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15 వేలిస్తమని చెప్పి మోసం చేసింది. అసలు గీ ప్రభుత్వ పథకాలేమిటో అర్థమైతలేదు. అప్పుడేమో రైతుల మీద ప్రేమున్నట్లు అన్నీ ఇస్తమని చెప్పింది. ఇప్పుడేమో సర్వేలంటూ సాగదీస్తున్నది. గింత వరకూ ఏ ఒక్క పథకం ఇచ్చింది లేకపాయే. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు కొండంత ధైర్యం ఉండే. గిసొంటి గోస లేకుండే. సకాలంలో రైతులందరికీ రైతు బంధు కింద పంట సాయమందించిండు. రుణమాఫీ చేసిండు. రంది లేకుంట ఎవుసం చేసుకొని బతికినం.' మళ్లా బీఆర్ఎస్ సర్కారే వస్తది. మాకు మంచి రోజులొస్తయి." అని ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ పర్యటించిన సందర్భంగా పలువురు రైతులు 'నమస్తే తెలంగాణ'తో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాల మేరకు ఏర్పాటైన బీఆర్ఎస్ అధ్యయన కమిటీ అన్నదాతల్లో ఆత్మస్థైర్యం నింపిందని, ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కొండంత అండగా నిలిచిందని తెలిపారు.

*- మంచిర్యాల, జనవరి 27*
*(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### బీఆర్ఎస్‌సోళ్లు ధైర్యం చెప్పిండ్రు..

బేల, జనవరి 27 : కాంగ్రెసోళ్లు రైతులను నమ్మించి ముంచిండ్రు. ఎలక్షన్ టైంలో అది చేస్తాం ఇది చేస్తాం అని.. చివరకు నమ్మించి మోసం చేయడమే కాకుండా.. గ్రామాల్లో గ్రామ సభలు పెట్టి ఆశలు పెట్టడం తప్ప ఏం చేసుడు లేదు. కానీ చనిపోయిన కుటుంబాలకు బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ వాళ్లు మా ఊరికి వచ్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చి ధైర్యం చెప్పిండ్రు. వచ్చే ఎలక్షన్‌లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం. రైతులకు అండగా ఉన్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమే. **- శంకర్, రైతు, రేణిగూడ గ్రామం, బేల మండలం**

### రుణ మాఫీ కాలే.. మాకు పైసా రాలే

బేల, జనవరి 27 : ఎన్నికల సమయంలో ఇచ్చినటువంటి రూ.2 లక్షల రుణమాఫీ మాకు ఇంకా కాలేదు. నాకు రూ.2 లక్షల పైగా అప్పు ఉంది. రుణమాఫీ కాకపోవడంతో బ్యాంక్ అధికారులు సతాయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇస్తానన్న పథకాలు మాకు ఇయ్యాలి. రైతు భరోసా కింది రూ.15 వేలు ఇస్తామని ఎగ్గొట్టిండు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇస్తామని ఇయ్యలే. కేసీఆర్ సారే బాగుండే మాకు. బీఆర్ఎస్ కమిటీ వచ్చి ఆత్మహత్య రైతు చేసుకున్న కుటుంబాన్ని ఓదార్చి లక్ష రూపాయలు ఇచ్చి అండగా నిలిచిండ్రు. కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఏమీ ఇయ్యలే. **- హాన్ దశరథ్, రైతు, రేణుగూడ, బేల మండలం**

### రైతుల బాధలు తెలుసుకున్నరు..

బేల, జనవరి 27 : బీఆర్ఎస్ పార్టీ అధ్యయన కమిటీ మా గ్రామానికి చెందిన రైతు జాదవ్ దేవ్‌రావ్ కుటుంబాన్ని ఓదార్చి ధైర్యాన్నిచ్చింది. గ్రామంలోని రైతులందరి బాధలను అడిగి తెలుసుకున్నది. అప్పులు అందరికీ ఉంటాయి. ధైర్యంతో ముందుకు సాగాలని చెప్పింది. బీఆర్ఎస్ అధ్యయన కమిటీ మా గ్రామ రైతులందరికీ ధైర్యాన్నిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదైనా మాకు ఏం ఇయ్యాలే. ఇస్తదని భరోసా కూడా లేదు. రైతుల గోస తెలిసిన నాయకుడు కేసీఆర్ ఒక్కడే ఉండే. ఇప్పుడు ఇగో ఇస్తాం.. అగో ఇస్తాం అని.. ఆశ చూపెట్టి రైతులకు మోసం చేస్తున్నరు. నాకు 4 ఎకరాల భూమి ఉంది. నాకు ఒక్క రూపాయి కూడా రాలే.
**- విఠల్ రైతు, రేణిగూడ గ్రామం, బేల మండలం**

### ఈ సర్కారుతో అరిగోస పడుతున్నం..

భీంపూర్, జవనవరి 27 : మాకు 3 ఎకరాల భూమి ఉన్నది. పత్తి, కంది సాగు చేస్తున్నం. కేసీఆర్ సారు ఉండగా మాకు గానీ.. తోటి రైతులకు గానీ ఏ రంది (బాధ) లేకుండే. అప్పుడు మేము పంట పెట్టుబడికి బాకీలు తెచ్చుడే మర్చిపోయినం. ఇప్పుడు మళ్లా దళారుల దగ్గరికే పోతున్నం. ఇపుడున్న కాంగ్రెస్ సర్కారుతో రైతులకు అరిగోస అవుతున్నది. మొన్నటి ప్రజాపాలన, సర్వేలు మాకు విసుగు తెప్పిస్తున్నాయి. పోనీ ఇన్నిసార్లు సర్వేలు చేసి ఏమన్నా పథకాలు ఇస్తున్నరా అంటే అదీ లేదు. మా కుటుంబానికి కొత్తగా ఏ పథకాలు అందలేదు. ఆఖరికి రైతుభరోసా కూడా రాలే. గీ సర్కారుతో చిన్న రైతులకు ఇంకా కష్టమవుతున్నది. ఇగ ఇప్పడందరూ అప్పటి కేసీఆర్ సార్ పాలననే మంచిగా ఉండే అని గుర్తుకు తెచ్చుకుంటున్నరు.
**- పాలెపు అశోక్, రైతు, యాపల్‌గూడ , ఆదిలాబాద్ రూరల్ మండలం**

శుక్రవారం బేల మండలంలోని రేణిగుంట గ్రామంలో దేవరావ్ జాదవ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి

## విద్యారంగంపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్**

ఎదులాపురం, జనవరి 27: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పేద విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలనే డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.7700 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యార్థులతో పాటు యాజమాన్యాలు కూడా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కళాశాలలు మూసుకునే పరిస్థితులు వచ్చాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య శాఖ మంత్రిగా ఉండి కూడా విద్యారంగ సమస్యలపై సమీక్ష చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్, ప్రవీణ్, శీరిష, స్రవంతి, నిషా, శివని, ప్రణయ్, సాయికిరణ్ ఉన్నారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, నాయకులు

## పేదలకు ఇండ్ల స్థలాలివ్వాలి

ఐటీడీఏ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న నాయకులు

ఉట్నూర్, జనవరి27 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, జన్నారం ప్రాంతాల్లో ఇల్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలివ్వాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి, ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ అన్నారు. సోమవారం ఉట్నూర్‌లో ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఏపీవో వసంత్ రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ, రైతు భరోసా, కౌలు రైతులు, రైతు కూలీలకు ఆర్థిక సాయం అందించాలని, అన్ని రకాల వరి పంటలకు బోనస్ ఇవ్వాలని, అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, మహిళలకు రూ.2500 చొప్పున ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జుగాదిరావు, రాజమొగిళి, ఎల్లయ్య, సంబాజీ, నర్సయ్య, సంధ్యారాణి, ధర్ము పటేల్, గణేశ్, బోడి కిషన్, మహేందర్, మల్లేశ్, శంకర్ ఉన్నారు.

## ప్రజావాణికి అర్జీల వెల్లువ

ప్రజావాణిలో వినతిపత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 27: నిర్మల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సంక్షేమ పథకాలు, సమస్యలపై జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజల నుంచి అర్జీలు వెల్లువలా వచ్చాయి. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, వ్యవసాయం, భూ సమస్యలు, రెండు పడక గదులు, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. శాఖల వారీగా పెండింగ్‌లోని దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### రెండు లక్షల రుణమాఫీ కాలేదు..

ఎన్నికల ముందు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చింది. రుణమాఫీ లిస్టుల నేను తీసుకున్న పంట రుణం మాఫీ కాలేదని సార్లు చెప్పిండ్రు. మాకు 4 ఎకరాల భూమి ఉన్నది. నా పేరుతో నాగవత్ యమునాబాయితో పేరుపై మొత్తం రూ. 2.87 లక్షల రుణం తీసుకున్నం. ఇందులో రూ.81 వేలు కట్టినం. అయినప్పటికీ రుణమాఫీ కాలేదు. రుణమాఫీ చేయాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన. ప్రభుత్వం పట్టించుకొని రుణమాఫీ చేయాలి. **-లాలానాయక్, రైతు, చందూనాయక్ తండా**

### భూ సమస్య పరిష్కరించాలి..

నాకు ముజ్గి గ్రామంలో రెండెకరాల 37 గుంటల భూమి ఉంది. ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నా భూమిని కబ్జా చేసిండు. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకుంట లేరు. సర్వేయర్ భూమి కొలిచి హద్దులు ఏర్పాటు చేసినా మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నరు. గత ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. అధికారులు స్పందించి మా భూమి మాకు ఇప్పించాలని కోరుతున్నా.
**-ఆర్. భూమన్న, ముజ్గి, రైతు**

### సమస్యల పరిష్కారం కోసం.. సద్దులతో వచ్చి..

నిర్మల్ కలెక్టరేట్ ఆవరణలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న అర్జీదారులు

నిర్మల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సుల్లో భోజనం తెచ్చుకొని ఆకలి తీర్చుకున్నారు. జిల్లాలోని వాలేగాంకు చెందిన గ్రామస్తులు భూసమస్య పరిష్కారానికి ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. అర్జీ ఇవ్వడం పూర్తయ్యే సరికి మధ్యాహ్నం కావడంతో కలెక్టరేట్ ఆవరణలో అందరూ ఒక చోట కూర్చొని భోజనం చేశారు. వ్యయ ప్రయాసాలకు ఓర్చుకొని వచ్చి అర్జీలు ఇచ్చామని, అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యుత్ కాంతులతో కెస్లాపూర్‌లోని నాగోబా ఆలయం

## నేటి నుంచి నాగోబా జాతర షురూ

● మహాపూజలకు ఏర్పాట్లు చేసిన మెస్రం వంశీయులు

● నేటి నుంచి ఫిబ్రవరి 4 వరకు జాతర, 31న ప్రజా దర్బార్

ఇంద్రవెల్లి, జనవరి 27 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కెస్లాపూర్‌లో నేటి నుంచి నాగోబా జాతర ప్రారంభం కానున్నది. ప్రతి యేటా పుష్యమాసం అమావాస్య రోజున అర్ధరాత్రి నాగోబాకు మెస్రం వంశీయులు మహాపూజలు నిర్వహించడంతో జాతర వైభవంగా ప్రారంభమవుతుంది. ఏడు రోజుల పాటు జరిగే జాతరకు తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, ఒడిశా, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో తరలివస్తారు. విదేశాల నుంచి పర్యాటకులు, సందర్శకులు తరలివచ్చి నాగోబాను దర్శించుకుంటారు. మహాపూజలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్ తెలిపారు. జాతరకు వచ్చే భక్తుల కోసం అధికారులు వసతులు కల్పించారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఎదులాపురం, జనవరి 27: తొమ్మిది నెలలు పెండింగ్‌లో ఉన్న కోడి గుడ్ల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం కోడి గుడ్డు పెట్టాలని చెబుతున్న అధికారులు దానికి అనుగుణంగా బిల్లులు చెల్లించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రూ.10వేలు వేతనం ఇస్తామని ప్రకటించారని, కానీ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శ్రీదేవి, నాగమణి, రాంబాయి, పుష్ప, ఇస్రు. రుక్కాబాయి, శకుంతల, అనిత పాల్గొన్నారు.